
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
సోమవారం । 23 । డిసెంబర్ । 2024



సోమశిలలో 72.249 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో ఆదివారానికి 72.249 టీఎంసీలు ఉన్నాయి. ఎగువ నుంచి 2025 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుంది. డెల్టాకు 1550, ఉత్తర కాలువకు 650, దక్షిణకాలువకు 350, కండలేరుకు 1200 క్యూసెక్కుల విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.78,470
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.7,100
3 శాతం జీఎస్టీతో	రూ.7,313
సవర (8 గ్రా)	రూ.58,504

గరిష్టం/కనిష్టం
30.6 /24.6

వాతావరణం

జిల్లాలో సోమవారం వాతావరణం పొడిగా ఉంటుంది. అక్కడక్కడ ఆకాశం మేఘావృతంగా ఉండే అవకాశం ఉంది. ఆదివారం గాలిలో తేమ 76 శాతం ఉంది.

న్యూస్‌రీల్

నేడు ఐటీఐలో జాబ్‌మేళా

నెల్లూరు (టౌన్): స్థానిక వెంకటేశ్వరపురంలోని ప్రభుత్వ బాలుర ఐటీఐలో సోమవారం ఉదయం 9 గంటలకు జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఐటీఐ ప్రిన్సిపల్ శ్రీధర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జాబ్‌మేళాకు డైకిన్, పానాసోనిక్ లైఫ్ సొల్యూషన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, అమర్‌రాజా బ్యాటరీస్, భార్గవి ఆటోమొబైల్స్ ప్రైవేట్ లిమిటెడ్ తదితర కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని వెల్లడించారు. ఎస్‌ఎస్‌సీ, ఇంటర్, ఐఐటీ డిప్లొమా చదివిన నిరుద్యోగులు జాబ్‌మేళాకు హాజరు కావచ్చన్నారు. మరిన్ని వివరాలకు 94944 56236, 63015 29271 నంబర్లలో సంప్రదించాలన్నారు.

పెద్దాస్పత్రిలో జికా వైరస్ బాధితుల వార్డు

నెల్లూరు(అర్బన్): నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి (పెద్దాస్పత్రి)లో జికా వైరస్ బాధితుల కోసం ముందస్తుగా వార్డును ఏర్పాటు చేశారు. పొరుగు రాష్ట్రాల్లో జికా వైరస్ కేసులు నమోదు అవుతున్నాయి. తాజాగా జిల్లాలోని మర్రిపాడు మండలం వెంకటాపురంలో ఒక బాలుడికి జికా వైరస్ సోకినట్లు ముంబయిలోని ఒక ప్రైవేట్ ల్యాబ్ నిర్ధారించడం జరిగింది. దీంతో బాలుడిని చెన్నై ఎగ్మూర్‌లోని బేబీ ఆస్పత్రికి తల్లిదండ్రులు తీసుకెళ్లి చికిత్స చేయిస్తున్నారు. ఈ నేపథ్యంలో వైద్యశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పెద్దాస్పత్రిలోని పల్మనాలజీ విభాగంలోని ఒక ఫ్లోర్‌లో 5 పడకలతో ఒక వార్డును ప్రత్యేకంగా సిద్ధం చేశారు. అక్కడ తాగునీరు, విద్యుత్ సౌకర్యం, ఇతర వసతులతో పాటు ఐసీయూ తరహాలో వెంటిలేటర్ తదితర సౌకర్యాలు సిద్ధం చేశారు. ఇప్పటి వరకు జికా వైరస్ కేసులు రానందున ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆస్పత్రి సూపరింటెండెంట్ సిద్ధానాయక్ తెలిపారు. ఒక వేళ జికా కేసులు వస్తే సందర్భాన్ని బట్టి పడకల సంఖ్యను పెంచుతామని తెలిపారు.

పార్కు స్థలంలో భవన నిర్మాణంపై చర్యలు

సాక్షి ఎఫెక్ట్..

నెల్లూరు (బారకాసు): పార్కు స్థలాన్ని నిర్మించి భవన నిర్మాణం చేపట్టడంపై నగర పాలక సంస్థ అధికారులు చర్యలు చేపట్టారు. 'లంచాల పునాదులపై ఆక్రమ నిర్మాణాలు' అనే శీర్షిక ఈ నెల 19న 'సాక్షి'లో ప్రచురితమైన విషయం విదితమే. దీనిపై నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు స్పందించారు. నగరంలోని బీవీనగర్‌లో జీవీఆర్‌ఆర్ కళాశాల సమీపంలో ప్రభుత్వ పార్కు స్థలం ఆక్రమించి వాణిజ్య భవన సముదాయం నిర్మించిన విషయం వాస్తవమేనని ఎస్‌ఎంసీ అధికారులు గుర్తించారు. దీంతో ఆ భవన యజమానికి ఇప్పటికే నోటీసు జారీ చేశారు. పార్కు ఆక్రమించిన విషయాన్ని ప్రభుత్వానికి కూడా తెలియజేశారు. ప్రభుత్వం నుంచి వచ్చే ఆదేశాల మేరకు తగిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఎంసీ అధికారులు తెలియజేశారు.

ఉచితంగానే స్మార్ట్ మీటర్లు

- కొత్త సర్వీసులకు అదనంగా వసూలు చేస్తే చర్యలు



జిల్లా సర్కిల్ ఎస్‌ఈ విజయన్

నెల్లూరు (వీఆర్సీ సెంటర్): జిల్లాలో ఏర్పాటు చేస్తున్న విద్యుత్ స్మార్ట్ మీటర్లకు వినియోగదారులు ఎలాంటి రుసుం చెల్లించనవసరం లేదని, ఉచితంగా మీటర్లను బిగిస్తామని ఏపీఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్‌ఈ విజయన్ స్పష్టం చేశారు. నగరంలోని ఏపీఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ప్రధాన కార్యాలయం విద్యుత్ భవన్‌లో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కొత్తగా విద్యుత్ సర్వీసు కనెక్షన్లు కావాలనుకునే వారు ఏపీ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ నిర్దేశించిన రుసుం మాత్రమే చెల్లించాల్సి ఉంటుందన్నారు. విద్యుత్ సిబ్బంది అదనంగా నగదు వసూలు చేస్తే వారిపై చర్యలు తప్పవని హెచ్చరి ంచారు. నూతనంగా గృహ విద్యుత్ సర్వీసు అవసరమైన వారు కిలో వాట్‌కు రూ.1,500, అంతకంటే ఎక్కువ అవసరమైతే.. ప్రతి ఒక్క కిలో వాట్‌కు రూ.2,000, సెక్యూరిటీ డిపాజిట్‌గా మరో రూ.200 చెల్లించాల్సి ఉంటుందన్నారు. అదే కమర్షియల్ (వాణిజ్య వినియోగానికి) రూ.2,000లతోపాటు సెక్యూరిటీ డిపాజిట్‌గా రూ.800 చెల్లించాలన్నారు. గృహ వినియోగదారులు త్రీఫేస్ విద్యుత్ కనెక్షన్‌కు అయితే రూ.20,000 చెల్లించాల్సి ఉంటుందని, వ్యవసాయ విద్యుత్ సర్వీసులకు కిలోవాట్‌కు రూ.1,500లతోపాటు సెక్యూరిటీ డిపాజిట్‌గా రూ.60 చెల్లించాలన్నారు. ఈ మొత్తాలకంటే విద్యుత్ సిబ్బంది వినియోగదారుల నుంచి అదనంగా నగదు వసూలు చేస్తే ఫిర్యాదు చేస్తే.. వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


చేతకాక.. చేతులెత్తేసి..

రాళ్లపాడు రైతుకు నీటి కష్టాలు

- ప్రాజెక్ట్ కుడి కాలువ గేటు మరమ్మతులు చేపట్టలేకపోయిన నిపుణులు
- గేటును పైకి లేపడం కష్టసాధ్యమని తేల్చిన వైనం
- ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడంలో ప్రభుత్వం వైఫల్యం
- నీరందక ఆయకట్టులో ఎండుతున్న వరినాట్లు
- పాతిక వేల ఎకరాల్లో సాగు ప్రశ్నార్థకం



రాళ్లపాడు ప్రాజెక్ట్‌లో నీటి నిల్వ



రైతుల జీవనాడి రాళ్లపాడు ప్రాజెక్ట్ గేటు మరమ్మతులు చేపట్టడంలో నారా ప్రభుత్వం అసమర్థత బయటపడింది. ఆధునిక టెక్నాలజీ అందుబాటులో ఉన్నప్పటికీ దాదాపు మూడు వారాలుగా ఈ సమస్యను పరిష్కరించడం చేతకాక.. చేతులెత్తేసింది. గలగలపారే నదుల్లో నీటిని దారి మళ్లించి డ్యామ్‌లు కడుతున్నారు. నిండుకుండ లాంటి ప్రాజెక్ట్ గేట్లు కొట్టుకుపోతే పునరుద్ధరించగలుగుతున్నారు. ఉవ్వెత్తున ఎగసి పడే సముద్ర గర్భం నుంచే పటిష్ట పునాదులు వేయగలిగే సాంకేతిక సామర్థ్యం ఉంది. గొప్ప గొప్ప ప్రాజెక్ట్‌లు కట్టామని గొప్పలు చెప్పుకునే చంద్రబాబు ఆఫ్టరాల్ చిన్న గేటుకు మరమ్మతులు చేయించలేక చతికల పడ్డారు. వేలాది ఎకరాలను బీడుగా మార్చేస్తున్నారు.

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: జలవనరుల శాఖ నిర్లక్ష్యం.. పాలకుల అసమర్థకు రాళ్లపాడు ప్రాజెక్ట్ నిదర్శనం. నారా ప్రభుత్వం చేతకాని తనానికి ఈ ప్రాజెక్ట్ ఉదాహరణగా నిలుస్తోంది. 1.1 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం కలిగిన చిన్న ప్రాజెక్ట్ కుడి కాలువ గేటు ఊడిపోతే మరమ్మతులు చేపట్టలేక మూడు వారాలుగా కుస్తీ పడుతోంది. నిన్నా.. మొన్నటి వరకు మరమ్మతులు సమర్థవంతంగా పూర్తి చేస్తామంటూ గొప్పలు చెప్పిన ఎమ్మెల్యేలు, ఇంజినీరింగ్ నిపుణులు ఇప్పుడు చేతులెత్తేశారు. ప్రాజెక్ట్ నిండా నీళ్లు ఉన్నా.. ప్రభుత్వ వైఫల్యం కారణంగా దాదాపు 25 వేల ఎకరాల్లో సాగు ప్రశ్నార్థకంగా మారింది. రైతులు రోడ్డెక్కి ఆందోళనలు చేపడుతున్నా.. ప్రత్యామ్నాయంగా సాగునీటిని విడుదల చేసే విషయంలో మీనమేషాలు లెక్కిస్తుండడంతో దుక్కులు, నాటిన నాట్లు ఎండిపోతున్నాయి.మరో వైపు నారుమళ్లు ముదిరిపోతున్నాయి.

చిత్తశుద్ధి లేదా? చేసే ఉద్దేశంలేదా?

ఒక టీఎంసీ కంటే తక్కువనిల్వ ఉన్న ప్రాజెక్ట్ గేటుకు మరమ్మతులుచేపట్టలేక ప్రభుత్వం చేతులెత్తేసిందంటే.. చిత్తశుద్ధి కొరవడిందా? అసలు ఈ సమస్యను పరిష్కరించే ఉద్దేశమే లేదా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్రంలో జలవనరుల శాఖలో అత్యంత సమర్థులైన ఇంజినీరింగ్ నిపుణులు ఉన్నా.. వారి సేవలను వినియోగించుకోలేకపోవడం చూస్తే.. ప్రభుత్వం తీరుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల కర్ణాటకలోని తుంగభద్ర డ్యామ్‌కు సంబంధించి ఒక గేటు కొట్టుకుపోతే.. రోజుల వ్యవధిలో పునరుద్ధరించగలిగారు. ఉధృతంగా ఉరకలెత్తే నదుల్లో నీటిని దారిమళ్లించి పెద్దపెద్ద డ్యామ్‌లు కడుతున్న, ఉవ్వెత్తున ఎగిసిపడే సముద్ర జలగర్భంలోకి చొచ్చుకెళ్లి పోర్టుల నిర్మాణాలు, జట్టీలు, వంతెనలు నిర్మించగలే టెక్నాలజీ అందుబాటులో ఉన్న ఈ రోజుల్లో ఈ చిన్నపాటి ప్రాజెక్ట్ గేటుకు మరమ్మతులు చేయలేకపోతుందంటే గొప్పలు చెప్పుకునే నారా ప్రభుత్వం సామర్థ్యమెంతో అర్థమవుతోంది.

ఖర్చుకు వెరసి.. వెనక్కి తగ్గారా?

ఈ గేటుకు మరమ్మతులు చేపట్టడం కొంచెం కష్టతరమే అయినా.. ప్రత్యామ్నాయ చర్యలతో చేపట్టే అవకాశం ఉందని కొందరు విశ్రాంత ఇంజినీరింగ్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. వందల టీఎంసీల నిల్వ ఉన్న తుంగభద్ర ప్రాజెక్ట్ గేటు కొట్టుకుపోతే.. పునరుద్ధరించగలిగితే.. ఇది చేయలేమా అని ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం కేవలం ఖర్చుకు వెరసి గేటు మరమ్మతులకు వెనకడుగు వేసినట్లు నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

ఎండుతున్న పంటలు

ప్రాజెక్ట్ కుడి, ఎడమ కాలువల కింద దాదాపు 25 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. ప్రాజెక్ట్ ఎడమ కాలువ పరిధిలో ఉండే ఆయకట్టు చాలా స్వల్పం. అత్యధికంగా 20 వేల ఎకరాల ఆయకట్టు కుడి కాలువ పరిధిలోనే ఉంది. మెజార్టీ రైతులు ఈ ఏడాది వరి సాగు చేయాలనే లక్ష్యంతో వరినార్లు సాగుకు సిద్ధమయ్యారు. ప్రస్తుతం కుడి కాలువకు నీరు విడుదల లేకపోవడంతో దిక్కుతోచని స్థితిలో పడ్డారు.

రైతుల ఆందోళన పట్టని ప్రభుత్వం

రాళ్లపాడు రైతులు పార్టీలకు అతీతంగా రోడ్డెక్కి ఆందోళనలు చేపడుతున్నా.. ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదు. దాదాపు ఒక నియోజకవర్గం మొత్తం సాగు భూములు బీడు భూములు మారే పరిస్థితులు కళ్ల ముందే కనిపిస్తున్నా.. కనీసం ముఖ్యమంత్రి కానీ, జలవనరుల శాఖ మంత్రి కానీ ప్రాజెక్ట్ కింద రైతుల ఆందోళన తీర్చే ప్రయత్నం చేయకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కుడి కాలువ గేటు సమస్య పరిష్కారం కాదని నిపుణులు తేల్చి చెప్పారు. మోటార్లు ఏర్పాట్లు చేసి కాలువకు నీరు పంపింగ్ చేయడం ఒక్కటే మార్గమని స్పష్టం చేశారు. అయినా ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడంలో నిర్లక్ష్యం వహించింది.



మరమ్మతులు చేస్తుంటే రైతుల ఎదురుచూపులు

నీటి పంపింగ్‌లో చిత్తశుద్ధి ఏది?

దాదాపు 15 రోజుల నుంచి కుడి కాలువ పరిధిలోని ఆయకట్టు రైతులు నీటి కోసం ఆందోళన చేస్తూనే ఉన్నారు. రైతుల ఆందోళనలు ఉధృతం కావడంతో నామమాత్రంగా కేవలం 15 హార్స్, 20 హార్స్ పవర్ గల రెండు మోటార్లు పెట్టి.. కుడి కాలువకు అరకొరగా పంపింగ్ చేస్తున్నారు. దిగువ వరకు సాగునీరు అందాలంటే 200 క్యూసెక్కులకు పైగా నీటిని కాలువకు విడుదల చేయాలి. కానీ ప్రస్తుతం 120 క్యూసెక్కులు విడుదల చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. దీంతో కాలువ కింద ముందు ఉన్న రైతులు అడ్డు కట్టలు వేసుకుని తమ పంటలను కాపాడుకునే పనిలో పడ్డారు. దీంతో చివరి ఆయకట్టు ఉన్న చినపవని, పెదపవని, మక్కెవారిపాళెం, సత్యనారాయణపురం, మేదరమిట్లపాళెం, జంగాలపల్లి, సీతారామపురం, అన్నెబోయినపల్లి, అంగిరేకులపాడు తదితర గ్రామాలకు చెందిన రైతులు నీటి కోసం అల్లాడుతున్నారు. ఆయా గ్రామాల్లో సాగు చేసిన నారుమడులు, వరినాట్లు పూర్తిగా ఎండిపోతున్నాయి. పొలాలు నెర్రెలిచ్చి నీటి కోసం ఎదురు చూస్తున్నాయి.

కుడి కాలువకు పూర్తిస్థాయిలో నీరు

లింగసముద్రం: రాళ్లపాడు ప్రాజెక్ట్ కుడికాలువకు పూర్తిస్థాయిలో నీరు విడుదల చేసేలా ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ ఓ. ఆనంద్ చెప్పారు. ఆదివారం రాళ్లపాడు కుడి కాలువ తూమును, కాలువకు వస్తున్న నీటిని పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ గేటు పైకి లేవకపోవడంతో ప్రత్యా మ్నాయ ఏర్పాట్లు చేసి 110 క్యూసెక్కుల నీరు కాలువలో వెళ్తున్నప్పటికీ చివరి భూములకు అందడం లేదని తన దృష్టికి వచ్చినట్లు చెప్పారు. మేఘా ఇంజినీరింగ్ కంపెనీ కరీంనగర్ నుంచి నాలుగు మోటార్లను తెప్పించినట్లు చెప్పారు. ఆదివారం సాయంత్రానికి రెండు మోటార్లు బిగించి 60 క్యూసెక్కులు అదనంగా ఇవ్వడం జరుగుతుందన్నారు. సోమవారం మరో రెండు మోటార్లను బిగించి అదనంగా మరో 60 క్యూసెక్కులు ఇవ్వడం జరుగుతోందన్నారు. కందుకూరు సబ్‌కలెక్టర్ తిరుమణి శ్రీపూజ, ఎస్‌ఈ వరలక్ష్మి, ఇరిగేషన్ అధికారులు ఉన్నారు.



తూమును పరిశీలిస్తున్న కలెక్టర్ ఆనంద్



కుడి కాలువ గేటుకు మరమ్మతులు (ఫైల్)

సమస్య ఏమిటంటే..

రాళ్లపాడు ప్రాజెక్ట్ పూర్తి సామర్థ్యం 24 అడుగులు (1.11 టీఎంసీలు). దాదాపు రెండేళ్ల తర్వాత సమృద్ధిగా కురిసిన వర్షాలకు 20 అడుగుల మేర ప్రాజెక్ట్‌కు నీరు చేరింది. పంట కాలువలకు నీటిని విడుదల చేసేందుకు దాదాపు 20 రోజుల క్రితం కుడి కాలువ షట్టర్ గేట్ పైకి ఎత్తే క్రమంలో ఊడి కిందకు పడిపోయింది. ఈ గేటును పైకి లేపి నీటి విడుదల ప్రక్రియను కొనసాగించాల్సి ఉంది. రాష్ట్రంలోనే ప్రాజెక్ట్ గేట్ల మరమ్మతుల్లో నిపుణులైన పలువురిని అధికారులు ప్రాజెక్ట్ వద్దకు రప్పించారు. దాదాపు పది రోజుల పాటు శ్రమించిన పలువురు నిపుణులు కష్టమని, ప్రాజెక్ట్‌లో నీటి సమస్య తగ్గే వరకు ఏమీ చేయలేమని తేల్చారు. దీంతో కుడి కాలువకు నీటిని విడుదల చేసే పరిస్థితి లేకుండా పోయింది.

ముమ్మాటికీ ప్రభుత్వ నిర్లక్ష్యమే



రాళ్లపాడు ప్రాజెక్ట్ రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. కాలువకు ప్రత్యామ్నాయంగా నీటిని విడుదల చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. ఈ చిన్నపాటి గేటుకు మరమ్మతులు చేపట్టలేకపోవడం చూస్తే.. చంద్రబాబు ప్రభుత్వ అసమర్థతకు అద్దం పడుతోంది. ప్రస్తుతం పంటలు ఎండిపోతున్నాయి. మా ప్రభుత్వంలో రైతులను ఆదుకునేందుకు ఎన్నో ప్రయత్నాలు చేశాం. ఏ సమస్య వచ్చినా సకాలంలో పరిష్కరించే విధంగా చర్యలు ఉండేవి. ఈ సమస్యను పరిష్కరించకుంటే.. రైతుల పక్షాన నిలబడి ఆందోళనకు చేయడానికి సిద్ధంగా ఉన్నాం.

– కాకాణి గోవర్ధన్‌రెడ్డి, మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు

రైతులను ఆదుకోవాలి



దాదాపు 20 రోజుల నుంచి రాళ్లపాడు ప్రాజెక్ట్‌కింద రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా కాలువకు నీటిని విడుదల చేసి రైతులను వెంటనే ఆదుకోవాలి. ఇప్పటి వరకు అటువంటి చర్యలు తీసుకోకపోవడంతో ప్రస్తుతం పంటలు ఎండిపోయే పరిస్థితి వచ్చింది. ప్రాజెక్ట్ నిండా నీరు ఉన్నా ఆయకట్టు రైతులకు నీరు ఇవ్వలేకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనం. ఒక నియోజకవర్గం మొత్తం బీడు భూములుగా మారే పరిస్థితులు ఉండడంతో రైతుల కళ్లల్లో నిర్వేదం కనిపిస్తోంది.

– బుర్రా మధుసూదన్‌యాదవ్, మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి

గంజాయి హబ్‌గా కావలి

కావలి కేంద్రంగా గంజాయి హబ్ నడుస్తున్నట్లు ఇటీవల అరెస్ట్‌ల పర్వంతో తెలుస్తోంది. గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గంజాయిని నిరోధించేందుకు పక్కా ప్రణాళికలతో వ్యవహరించింది. సాగు చేసే భూముల్లోని గంజాయి తోటలను ధ్వంసం చేసింది. సెబ్‌తోపాటు పోలీసు శాఖ కూడా నిఘా పెట్టి మూలల నుంచే ఏరివేత దిశగా చర్యలు చేపట్టింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పాలకులు, పోలీసులు రెడ్‌బుక్ రాజ్యాంగంపై దృష్టి పెట్టడంతో గంజాయి వ్యాపారులు కోరలు చాస్తున్నారు. ఇక్కడి నుంచే నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో గంజాయి విక్రేతల నెట్‌వర్క్ విస్తరించినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడి కావడంతో అప్రమత్తమయ్యారు. ఈ వ్యాపారంలో మహిళలు కీలక పాత్ర పోషిస్తుండడంతో పోలీసులే నివ్వెరపోతున్నారు. ఈ నెట్‌వర్క్ తీగ దొరకడంతో డొంక కదిలించే దిశగా పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు.

రాజమండ్రి, విశాఖ నుంచి హోల్‌సేల్‌గా కొనుగోలు

- నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో విస్తృతంగా అమ్మకాలు
- విక్రేతల ముఠాలో దంపతులు, మహిళలు
- హోల్‌సేల్ విక్రేతల కోసం పోలీసుల వేట
- పోలీసులకు సవాల్‌గా హోల్‌సేల్ సరఫరాదారుల అరెస్ట్‌లు

కావలి: కళాశాలల విద్యార్థులే టార్గెట్‌గా గంజాయి విక్రయాలను వ్యాపారులు విస్తరిస్తున్నారు. కావలిలోని విక్రమ సింహపురి పీజీ కళాశాల సమీపంలో ఇటీవల గంజాయి విక్రయాలు చేస్తున్న ఓ ముఠా పోలీసులకు పట్టుబడింది. దర్యాప్తులో విస్తుపోయే విషయాలు వెల్లడయ్యాయి. రాజమండ్రి, విశాఖ నుంచి గంజాయిని హోల్‌సేల్‌గా కొనుగోలు చిన్న చిన్న ప్యాకెట్లుగా కావలి కేంద్రంగా ఉమ్మడి నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో గంజాయి రిటైల్ వ్యాపారుల నెట్‌వర్క్ విస్తరించినట్లు తెలిసింది. ఇప్పటికే ఈ నెట్‌వర్క్ ముఠాలోని కొందరిని అరెస్ట్ చేసిన పోలీసులు.. మిగతా రిటైల్, హోల్‌సేల్ వ్యాపారుల పట్టుకునేందుకు వేట సాగిస్తున్నారు.

డొంక కదిలించే పనిలో పోలీసులు

ఈ గంజాయి ముఠా అరెస్ట్ తర్వాత కావలి పోలీసులు అప్రమత్తం అయ్యారు. ఈ ముఠా ఎంతకాలంగా గంజాయి అమ్మకాలు చేస్తుంది, ఏఏ ప్రాంతాల్లో చేస్తుంది, వీరి నెట్‌వర్క్ విస్తరణ పరిధి ఏ మేరకు ఉందో, ఇంకా ఎంత మంది ఈ ముఠాతో ప్రత్యక్ష పరోక్ష సంబంధాలు ఉన్నాయి, ఈ ముఠా గంజాయి అమ్మే ప్రదేశాలు, వినియోగించే వ్యక్తులు, గంజాయి అమ్మకాల ద్వారా కూడ బెట్టిన ఆస్తుల వరకు తదితర విషయాలపై కూపీలాగే పనిలో పోలీసులు రహస్యంగా విచారణ జరుపుతున్నారు. వీరికి తూర్పు గోదావరి జిల్లా కోటనందూరు మండలం దారకొండకు చెందిన ఓ వ్యక్తి గంజాయి సరఫరా చేస్తున్నట్లు గుర్తించారు. ఇంకెవరెవరికి గంజాయి సరఫరా చేస్తున్నాడనే తదితర అంశాలపై లోతుగా దర్యాప్తు చేయడానికి పోలీసులు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశారు.



కావలిలో పోలీసులకు పట్టుబడిన ముఠా వద్ద స్వాధీనం చేసుకున్న గంజాయి

విక్రయాల్లో మహిళలే కీలక పాత్రదారులు

గంజాయి విక్రయాల్లో మహిళలే కీలక పాత్ర పోషిస్తున్న విషయం వెల్లడవుతోంది. మాదక ద్రవ్యాలు రవాణా, అమ్మకాల్లో మహిళల భాగస్వామ్యం ఉందంటే అదొక విస్తృతమైన వ్యవస్థీకృత చీకటి వ్యవస్థగా పోలీసులు పరిగణిస్తున్నారు. కావలిలో పట్టుబడిన గంజాయి ముఠాలో ముగ్గురు మహిళలు ఉండడంతో పోలీసులే ఆశ్చర్యపోతున్నారు. కావలిలో గంజాయి నిల్వలు కలిగి అమ్మకాలు చేస్తూ పోలీసులకు పట్టుబడి ముఠాలో భార్యాభర్తలైన రెండు జంటలతోపాటు పట్టణానికి చెందిన మరో మహిళ ఉండడం గమనార్హం. పట్టణంలోని పెద్దపవని రోడ్డులో ఉన్న విక్రమ సింహపురి పీజీ కళాశాల వద్ద నివసించే షేక్ మస్తానమ్మ, షేక్ గౌస్‌బాషా, ప్రకాశం జిల్లా పొన్నలూరు మండలం మాలెపాడు గ్రామానికి చెందిన షేక్ గౌస్‌బాషా, షేక్ రసూల్ బీ దంపతులతోపాటు వైకుంఠపురం ప్రాంతానికి చెందిన షేక్ మీరాబీ గంజాయి ముఠాలో కీలక సభ్యులుగా ఉన్నారు. మొత్తం 8 మందితో కూడిన ఈ ముఠాలో మొదటి నిందితురాలుగా కావలికి చెందిన మహిళ ఉన్నట్లుగా సమాచారం. ఈ కేసులో దారకొండకు చెందిన గంజాయి సరఫరాదారుడిని అరెస్ట్ చేయాల్సి ఉంది.



కూటమి ప్రభుత్వం వచ్చాకే..

గడిచిన కొద్ది నెలలుగా జిల్లాలోని కళాశాలల విద్యార్థులే టార్గెట్‌గా గంజాయి అమ్మకాలు విచ్చలవిడిగా జరుగుతున్నాయి. గత ప్రభుత్వంలో గంజాయి పెంపకం, విక్రయాలను సమూలంగా నిర్వీర్యం చేస్తే.. కూటమి ప్రభుత్వ వచ్చాక వీరందరూ ముసుగులు తొలగించి బయటకు వస్తున్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి గంజాయి సాగు, విక్రయాలు మళ్లీ పెరిగాయని ఇటీవల అరెస్ట్‌లు స్పష్టం చేస్తున్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గంజాయి తోటల నుంచే నిరోధిస్తే.. కూటమి ప్రభుత్వం రెడ్‌బుక్ రాజ్యాంగంపై దృష్టి సారించింది. ప్రభుత్వ పాలకుల నుంచి పోలీస్ యంత్రాంగం అటెన్షన్ అంతా కూడా ప్రతిపక్షం నిర్వీర్యం దిశగా పనిచేస్తోంది. ఈ క్రమంలో గంజాయి విక్రేతలు తమ కోరలు చాచి జూలు విధిస్తున్నారు. గంజాయి పండించే ప్రాంతానికి చెందిన వ్యక్తితో సంబంధాలు పెట్టుకుని నెల్లూరు, ప్రకాశం జిల్లాలో తమ నెట్‌వర్క్ కలిగి ఉన్న ప్రాంతాల్లో విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. విశాఖపట్నం ప్రాంతానికి చెందిన రాజు అంతర్ రాష్ట్ర గంజాయి హోల్‌సేల్ సరఫరాదారుడిగా కావలి పోలీసుల రికార్డుల్లోకి తాజాగా ఎక్కాడు. బెంగళూరుకు చెందిన వేలును కావలి పోలీసులు పట్టుకుంటే వైజాగ్ రాజు విషయం బయటకు వచ్చింది. దారకొండ, విశాఖ ప్రాంతాలకు చెందిన హోల్‌సేల్ వ్యాపారులను పట్టుకుంటే.. పెద్ద డొంక కదిలే అవకాశం ఉందని పోలీసులు భావిస్తున్నారు.

ఏపీలో బీఆర్ అంబేడ్కర్ వర్సిటీ ఏర్పాటు చేయాలి



అధ్యయన కేంద్రం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న అకడమిక్ కౌన్సిలర్స్, ఉద్యోగులు

నెల్లూరు (టౌన్): ఏపీలో అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలని జిల్లా కోఆర్డినేటర్ పిచ్చయ్య డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సర్వోదయ డిగ్రీ కళాశాలలోని వర్సిటీ అధ్యయన కేంద్రం ఎదుట అకడమిక్ కౌన్సిలర్స్, ఉద్యోగులు, సిబ్బంది నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ఆంధ్రప్రదేశ్‌లో అడ్మిషన్లు నిలిపివేస్తూ తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో ఏపీ విద్యార్థులు ఇరకాటంలో పడ్డారన్నారు. కోర్సులు పూర్తి కాని విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందన్నారు. మొత్తం డిగ్రీ, పీజీ ఎన్‌రోల్‌మెంట్‌లో 12 శాతం దూర విద్య విద్యార్థులు ఉన్నారన్నారు. విశ్వవిద్యాలయంలో 90 శాతం మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులే ఉన్నట్లు వివరించారు. మొత్తం విద్యార్థుల్లో 48 శాతం మహిళలు ఉన్నారని తెలిపారు. ఏపీలోని అధ్యయన కేంద్రాల్లో అడ్మిషన్లు తీసుకున్న విద్యార్థుల నుంచి ఫీజుల రూపంలో తెలంగాణకు రూ.21 కోట్ల నిధులు వెళ్లాయన్నారు. ప్రతి ఏటా రెండు సార్లు అడ్మిషన్లు చేసుకునే అవకాశం ఉందన్నారు. ఏపీ ప్రభుత్వం సానుకూలంగా స్పందించి యూనివర్సిటీ ఏర్పాటుపై నిర్ణయం తీసుకుంటే ఈ విద్యా సంవత్సరం నష్టపోకుండా అడ్మిషన్లు చేసుకునే అవకాశం ఉందన్నారు. అధ్యయన కేంద్రాల్లో పని చేసే సిబ్బందికి ఇంకా జీతాలు రాలేదని, వారికి త్వరగా ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యయన కేంద్రం ప్రిన్సిపల్ రజనికుమారి, అకడమిక్ కౌన్సిలర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్వాహారాయుళ్లు సేఫ్

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో అవినీతికి పాల్పడిన తిమింగలాలను వదిలేసి చిరుద్యోగులను బలిచేస్తున్నారు. ఉపాధి పేమెంట్ల చెల్లింపు, జాబ్‌కార్డుల మంజూరులో కీలకమైన ఇద్దరు ఏపీఓలకు బదులు కింది స్థాయి సిబ్బందిపై క్రిమినల్ కేసులు నమోదు చేశారు. ఏపీఓల పేర్ల తొలగింపు వెనుక అధికార పార్టీ నాయకులు ముఖ్యభూమిక పోషించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

- కలువాయి మండలంలో ఉపాధి పనుల్లో అవినీతి
- కింది స్థాయి ఉద్యోగులపైనే కేసులు
- అక్రమాలపై అధికారుల బరితెగింపు
- అసలు కారకులను తప్పించడం వెనుక అధికార పార్టీ నేతలు



డ్వామా కార్యాలయం

నెల్లూరు(పొగతోట): కలువాయి మండలం చినగోపవరం గ్రామంలో అక్రమంగా 147 జాబ్‌కార్డులు సృష్టించారు. గ్రామంలో నివాసం ఉండకుండా ఇతర రాష్ట్రాలు, పక్క జిల్లాల్లో ఉండే వారి ఆధార్ కార్డులు సేకరించారు. చేయని పనులకు బిల్లులు పెట్టి చినగోపవరం గ్రామంలో రూ.25 లక్షల మేర ఉపాధి నిధులను స్వాహా చేశారు. జాబ్‌కార్డులు మంజూరు చేయడంలో సంబంధిత గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్, కంప్యూటర్ ఆపరేటర్, ఏపీఓ కీలకంగా వ్యవహరించారు. బిల్లుల చెల్లింపు చేసిన పనులను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడంలో, పనుల కేటాయింపులో ఏపీఓదే ముఖ్యపాత్ర.

ఇలా బయటకు..

ఈ మండలంలో 2023 – 24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 16వ విడత సోషల్ ఆడిట్‌లో రూ.58 లక్షలకు పైగా అవినీతి జరిగినట్లు అధికారులు గుర్తించారు. ఒక్క చినగోపవరం గ్రామంలోనే రూ.25 లక్షల అవినీతి జరిగినట్లు బయటపడింది. మండలంలో పనిచేసిన ముగ్గురు ఎంపీడీఓల సంతకాలను ఫోర్జరీ చేసి చేయని పనులకు బిల్లులను అప్‌లోడ్ చేశారు. ఈ విషయంలో ఇద్దరు ఏపీఓలు కీలకంగా వ్యవహరించినట్లు సమాచారం. ప్రస్తుతం దీనిపై డ్వామా కార్యాలయంలో విచారణ జరుగుతోంది. అధికారులు రికార్డులు తనిఖీలు చేస్తున్నారు. ఇక ఆ మండలానికి సంబంధించి చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్లు చినగోపవరం గ్రామంలో తనిఖీలు నిర్వహించి పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం ఫీల్డ్ అసిస్టెంట్ మహేందర్‌రెడ్డి, ఏపీఓలు ఎం.మురళీధర్‌రావు, డి.సుబ్బరాయుడు, కంప్యూటర్ ఆపరేటర్ పి.బాబు రాజేష్, టెక్నికల్ అసిస్టెంట్ ఆర్.ప్రసన్న, ఎంవీ ప్రసాద్, ఎం.వెంకటేశ్వర్లు, ఈసీ ఇన్‌చార్జ్ జె.శీనయ్యలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలంటూ డ్వామా పీడీకి పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ రాష్ట్ర కార్యాలయం నుంచి ఆదేశాలు అందాయి. అయితే ఇద్దరు ఏపీఓల పేర్ల మినహా మిగిలిన వారిపై కేసులు నమోదు చేయడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లతోనే అసలు కారకులను తప్పించారనే ఆరోపణలున్నాయి.

ఎంతంటే..

జిల్లా వ్యాప్తంగా ఇటీవల నిర్వహించిన సోషల్ ఆడిట్ (సామాజిక తనిఖీ)లో రాపూరు మండలంలో రూ.76 లక్షలు, కొండాపురం మండలంలో రూ.86 లక్షలు, కలిగిరి మండలంలో రూ.30 లక్షలు, సైదాపురం మండలంలో రూ.59 లక్షల మేర ఉపాధి పనుల్లో అవినీతి జరిగినట్లు అధికారులు నిర్ధారించారు. కానీ కలువాయి మండలంలోని సిబ్బందిపైనే చర్యలు తీసుకున్నారు. కొడవలూరు మండలం తలమంచికి సంబంధించి ఎంపీడీఓలు, ఉపాధి హామీ సిబ్బంది కుమ్మక్కై ఉపాధి నిధులు స్వాహా చేశారు. ఇందులో ఉపాధి సిబ్బందిపై చర్యలు తీసుకున్నారు. ఎంపీడీఓల విషయంలో స్పందన లేదు.

క్రిమినల్ కేసులు

కలువాయి: మండలంలో ఆరుగురు ఉపాధి హామీ సిబ్బందిపై క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు ఎస్సై సుమన్ ఆదివారం తెలిపారు. వివరాలు.. మండలంలో జరిగిన ఉపాధిహామీ పనుల్లో అవినీతి జరిగినట్లు అధికారులు విచారణలో తేల్చారు. ఈ నేపథ్యంలో వారిపై క్రిమినల్ కేసులు పెట్టాలని ఉన్నతాధికారులు ఎంపీడీఓ డీవీ నరసింహారావును ఆదేశించిన విషయం తెలిసిందే. ఆ మేరకు ఎంపీడీఓ శుక్రవారం కలువాయి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో ఆరుగురిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అధికారుల ఆదేశాలు అమలు చేశాం

చినగోపవరంలో అక్రమాలకు పాల్పడిన సిబ్బందిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని అధికారుల నుంచి ఆదేశాలందాయి. దీంతో ఆరుగురు సిబ్బందిపై క్రిమినల్ కేసులు నమోదు చేశాం. మిగిలిన మండలాల్లో అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటాం. రాపూరు మండలంలో అక్రమాలకు పాల్పడిన సిబ్బందిపై చర్యలకు సంబంధించిన ఫైల్ కలెక్టర్ వద్ద ఉంది. ఆయన ఆదేశాల ప్రకారం త్వరలో చర్యలు తీసుకుంటాం.

– గంగా భవానీ, డ్వామా పీడీ

జిల్లా వ్యాప్తంగా పోలీసుల తనిఖీలు



నెల్లూరు నగరంలో శనివారం అర్ధరాత్రి వాహన తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు



ఆర్టీసీ బస్సులో తనిఖీలు



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీస్

- బహిరంగ మద్యసేవనం, డ్రంక్ అండ్ డ్రైవ్‌పై 176 కేసులు
- నిబంధనల ఉల్లంఘనులపై రూ.2.02 లక్షల జరిమానా

నెల్లూరు(క్రైమ్): ఎస్పీ జి.కృష్ణకాంత్ ఆదేశాలతో పోలీసు అధికారులు జిల్లా వ్యాప్తంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. బహిరంగ మద్యసేవనం, డ్రంక్ అండ్ డ్రైవ్‌తోపాటు నిబంధనల ఉల్లంఘనులపై చర్యలు తీసుకుంటున్నారు. మరోవైపు కార్డన్ సెర్చ్‌లు చేస్తున్నారు. ఇంకోవైపు నేరనియంత్రణ చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు క్రిస్మస్, న్యూ ఈయర్, సంక్రాంతి నేపథ్యంలో తనిఖీలు మరింత ముమ్మరం చేశారు. అనుమానాస్పద వ్యక్తులు, పాతనేరస్తుల కదలికలపై నిఘా పెంచారు.

స్పెషల్ డ్రైవ్

శనివారం రాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకు పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. మద్యం మత్తులో వాహనాలు నడుపుతున్న 96 మందిపై కేసులు నమోదు చేశారు. బహిరంగంగా మద్యం తాగుతున్న 80 మందిపై కేసులు పెట్టారు. నిబంధనలు పాటించని వాహనచోదకులపై 514 కేసులు నమోదు చేసి రూ.2,02,890ల జరిమానాలు విధించారు. రికార్డుల్లేని పలు వాహనాలను స్వాధీనం చేసుకుని పోలీసుస్టేషన్లకు తరలించారు. ట్రిపుల్ రైడింగ్, మద్యం మత్తులో, రాంగ్‌రూట్‌లో వాహనాలు నడపడం ప్రమాదకరమని వాహనచోదకులకు సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ గమ్యస్థానాలకు సురక్షితంగా చేరుకోవాలని, ద్విచక్ర వాహనచోదకులు విధిగా హెల్మెట్, కార్లు, ఇతర వాహనాలు నడిపేవారు సీట్ బెల్టులు ధరించాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు తప్పవని హెచ్చరించారు. గంజాయి, మద్యం అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచారు. విశాఖ, రాజమండ్రి వైపు నుంచి తిరుపతి, బెంగళూరు, చెన్నైవైపు వెళ్లే వాహనాలను విధిగా తనిఖీలు చేస్తున్నారు.

లాడ్జీల్లోనూ సోదాలు

లాడ్జీలపై ప్రత్యేక నిఘా పెట్టారు. ఆదివారం తెల్లవారుజాము వరకు జిల్లావ్యాప్తంగా లాడ్జీల్లోని అన్ని గదులను క్షుణ్ణంగా సోదాలు చేశారు. బసచేసిన వ్యక్తుల వివరాలను సేకరించారు. రికార్డులను సక్రమంగా పెట్టుకోవాలని, బస చేసిన వ్యక్తుల వివరాలను రోజూ స్థానిక పోలీసుస్టేషన్‌లో తెలియజేయాలని సూచించారు. లాడ్జీ పరిసరాలు స్పష్టంగా కనిపించేలా తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

అవగాహన సదస్సులు

పండగ వేళ నేరాలు అధికంగా జరిగే అవకాశం ఉండటంతో నేరనియంత్రణ చర్యలపై పోలీసులు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. ప్రధాన కూడళ్లు, అపార్ట్‌మెంట్లు, కాలనీల్లో పబ్లిక్ అడ్రస్సింగ్ సిస్టం ద్వారా అవగాహన కల్పిస్తున్నారు. ఊర్లకు వెళ్లేవారు విధిగా స్థానిక పోలీసులను లేదా 94407 96383, 93929 03413 ఫోన్ నంబర్లను సంప్రదించి ఎల్‌హెచ్‌ఎంఎస్ సేవలను వినియోగించుకోవాలని సూచిస్తున్నారు. ప్రజలు తమ ప్రాంతాల్లో అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తున్నట్లు గుర్తిస్తే స్థానిక పోలీసులకు లేదా డయల్ 112కు సమాచారం అందిస్తే తగిన చర్యలు తీసుకుంటామని చెబుతున్నారు.

చందన, సీఎంఆర్‌లో వీక్లీ డ్రా



స్కూటీ విజేతకు కీ అందజేస్తున్న శ్రీనివాసులురెడ్డి, శివప్రసాద్

నెల్లూరు(బృందావనం): సంక్రాంతి, క్రిస్మస్, న్యూ ఇయర్ సందర్భంగా చందన, సీఎంఆర్ ప్రవేశపెట్టిన ఎక్స్‌ప్రెస్ సేల్ రెండో వీక్లీ డ్రాను రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి పెళ్లకూరు శ్రీనివాసులురెడ్డి, రాష్ట్ర టీడీపీ ఆరోగ్య విభాగం అధ్యక్షుడు డాక్టర్ జెడ్.శివప్రసాద్‌లు ఆదివారం తీశారు. నెల్లూరు సంతపేటకు చెందిన ధన్విక్, మైపాడు రోడ్డు 4వ మైలుకు చెందిన వై.సుజితను టీవీఎస్ జెస్ట్ స్కూటీల విజేతలుగా ప్రకటించారు. అలాగే డైలీ డ్రాలో విజేతలైన 70 మందికి గ్రైండర్, మిక్సీ, ఎలక్ట్రికల్ కుక్కర్, డిన్నర్ సెట్ తదితరాలను అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసులురెడ్డి, శివప్రసాద్‌లు మాట్లాడుతూ అత్యంత తక్కువ ధరలకు నాణ్యమైన వస్త్రాలు, బంగారు ఆభరణాలు ఇవ్వడం చందన, సీఎంఆర్‌లకే దక్కిందన్నారు. కార్యక్రమంలో సీఎంఆర్ అధినేతలు మావూరి శ్రీనివాసరావు, ఎం.సంతోష్‌రామమోహన్, మోపూరు పెంచలయ్య, శైలేష్ పాల్గొన్నారు.

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి :	రూ.25
సన్నవి :	రూ.18
పండ్లు :	రూ.10

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్) :	100
లేయర్ (లైవ్) :	100
బ్రాయిలర్ చికెన్ :	186
బ్రాయిలర్ స్కిన్‌లెస్ :	206
లేయర్ చికెన్ :	170

కోడిపందేల స్థావరాలపై దాడులు

ఆత్మకూరు: ఆత్మకూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి.గంగాధర్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం కోడిపందేల స్థావరంపై దాడులు చేశారు. వివరాలు.. ఆత్మకూరు మండలంలోని బట్టేపాడు శివారు భూముల్లో కోడిపందేలు నిర్వహిస్తున్నారని సమాచారం అందుకున్న ఎస్సైలు ఎస్‌కే జిలానీ, సాయిప్రసాద్, సిబ్బంది దాడులు నిర్వహించి ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారిని ఆత్మకూరు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. 19 మోటార్‌బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు.

- దగదర్తి(కావలి): దగదర్తి మండలం తురిమెర్లలో గుట్టుగా నిర్వహిస్తున్న కోడిపందేల స్థావరంపై దగదర్తి పోలీసులు ఆదివారం దాడులు నిర్వహించారు. పక్కా సమాచారంతో ఎస్సై జంపాని కుమార్, సిబ్బంది దాడులు నిర్వహించి ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. రూ.1,410 నగదు, మూడు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నకిలీ ఫోన్‌పేతో మోసం

మర్రిపాడు: నకిలీ ఫోన్‌పేతో వ్యాపారిని మోసం చేసిన ఘటన మండల కేంద్రంలోని మర్రిపాడులో ఆదివారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. ముగ్గురు వ్యక్తులు స్థానిక అబ్బిశెట్టి కిరణా దుకాణంలో రూ.15 వేల విలువైన సిగరెట్లను తీసుకుని డబ్బులు ఫోన్‌పే చేశామని బద్వేల్ వైపు మోటార్ బైక్‌పై వెళ్లిపోయారు. కాసేపటికి డబ్బులు బ్యాంక్ అకౌంట్లో జమ కాకపోవడంతో అది నకిలీ ఫోన్‌పే అని తెలుసుకున్న దుకాణ యజమాని వారి కోసం వెతికినా ప్రయోజనం లేకుండా పోయింది. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. మర్రిపాడు బస్టాండ్ సెంటర్‌లోని సీసీ కెమెరాలో ఆ ముగ్గురూ వెళ్తున్న దృశ్యాలు రికార్డయ్యాయి.

క్లుప్తంగా

అంతిమయాత్రలో అంతులేని కష్టాలు

- శ్మశాన దారి ఆక్రమణ ఫలితం
- బొడ్డువారిపాళెంలో దయనీయ స్థితి



బురదలో మృతదేహాన్ని మోసుకెళ్తున్న గ్రామస్తులు

కొడవలూరు: స్వార్థపరులు శ్మశాన దారినీ వదల్లేదు. ఫలితంగా గ్రామంలో ఎవరైనా చనిపోతే బురదలో ఇబ్బందులు పడుతూ మృతదేహాన్ని తీసుకెళ్లాల్సిన దయనీయ పరిస్థితి మండలంలోని బొడ్డువారిపాళెంలో నెలకొంది. గ్రామానికి ఉన్న శ్మశానానికి 15 అడుగుల వెడల్పుతో దారి ఉండేది. అయితే దారికిరువైపులా ఉన్న పొలాలకు చెందిన వారు కొంచెం కొంచెంగా ఆక్రమించడంతో నేడు రెండు అడుగులకు చేరింది. దీంతో పొలాల్లో నుంచి మృతదేహాన్ని తీసుకుపోవాల్సి వస్తోంది. బురదలో వెళ్లాల్సి రావడంతో మోసే ఆ నలుగురు కరువవుతున్నారు. గ్రామ మాజీ సర్పంచ్ రామయ్య వృద్ధాప్య రీత్యా మృతిచెందాడు. ఆదివారం మృతదేహాన్ని శ్మశానానికి తీసుకెళ్లే దారి లేకపోవడంతో నాట్లు వేసేందుకు సిద్ధం చేసిన బురద కయ్యల్లో నుంచి మోసుకెళ్లారు. జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి శ్మశాన ఆక్రమణలు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

తెలుగు తమ్ముళ్ల మధ్య తోపులాట

- కొమరికలో ఉద్రిక్తత



అధికారుల ఎదుట ఇరువర్గాల వాగ్వాదం

ఇందుకూరుపేట: మండలంలోని కొమరిక గ్రామంలో తెలుగు తమ్ముళ్ల మధ్య తోపులాటలు, దూషణలతో ఉద్రిక్తత నెలకొంది. గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు మునగశెట్టి మనోహర్ ఫీల్డ్ అసిస్టెంట్ రమేష్ సాయంతో ఉపాధి పనుల్లో అవతవలకు పాల్పడ్డారని అదే గ్రామానికి చెందిన ఆ పార్టీ నేత తాతా వెంకటేశ్వర్లు నెలరోజుల క్రితం అధికారులకు ఫిర్యాదు చేశాడు. దీంతో ఎంపీడీఓ నాగేంద్రబాబు, ఏపీఓ జ్యోతి, టెక్నికల్ అసిస్టెంట్ పి.బాబు, పంచాయతీ కార్యదర్శి భాస్కర్‌రావులు ఆదివారం గ్రామంలో విచారణ చేపట్టారు. ఈ సమయంలో ఇరువర్గాలు ఒకరిపై ఒకరు దూషణలకు దిగారు. అది కాస్త తోపులాటకు దారితీసింది. పోలీసులు రంగప్రవేశం చేసి సర్దిచెప్పారు. అధికారులు విచారణ పూర్తికాక ముందే వెళ్లిపోయారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

నెల్లూరు(క్రైమ్): మితిమీరిన వేగంతో మోటార్ బైక్ స్పీడ్‌బ్రేకర్‌ను ఎక్కడంతో వెనుక కూర్చొని ఉన్న మహిళ కిందపడి తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతిచెందింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. కర్ణాటక రాష్ట్రం మైసూర్‌లో షేక్ ముంతాజ్ (37) తన కుమారుడు షఫీతో కలిసి నివాసం ఉంటోంది. అక్కడ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. ఈనెల 17వ తేదీన ఆమె నెల్లూరు బుజబుజనెల్లూరులోని తన సోదరి నాగూర్‌బీ వద్దకు వచ్చింది. శనివారం సాయంత్రం ముంతాజ్ నగరంలోని పని ఉందని చెప్పి బయటకు వెళ్లింది. అర్ధరాత్రి ముంతాజ్ తన అక్క కుమారుడు తారీక్ బైక్‌పై స్నేహితురాలు వరలక్ష్మితో కలిసి మైపాడుగేటు సెంటర్ నుంచి మినీబైపాస్ మీదుగా బుజబుజనెల్లూరుకు బయలుదేరింది. నారాయణ స్కూల్ సమీపంలోకి వచ్చేసరికి తారీక్ బైక్‌ను వేగంగా నడుపుతూ స్పీడ్ బ్రేకర్‌ను ఎక్కించాడు. బైక్ అదుపుతప్పి చివరన కూర్చొని ఉన్న ముంతాజ్ కిందపడి తలకు తీవ్రగాయమై మృతిచెందింది. ఈ విషయాన్ని తారీక్ నాగూర్‌బీకి తెలియజేశాడు. వారు ఘటనా స్థలానికి చేరుకుని విగతజీవిగా పడి ఉన్న ముంతాజ్‌ను చూసి కన్నీటి పర్యంతమయ్యారు. ప్రమాద ఘటనపై నార్త్ ట్రాఫిక్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతానికి గురై..

- వ్యక్తి మృతి



వేణు మృతదేహం

ఉలవపాడు: ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌తో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన ఉలవపాడు ఉత్తర బైపాస్ సమీపంలో ఆవులబాట పక్కన పొలం వద్ద ఆదివారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. ఉలవపాడు పంచాయతీలోని కొల్లూరుపాడు గ్రామానికి చెందిన సుదర్శి వేణు (35)కు వివాహమైంది. అడవి పందుల కోసం ఉచ్చులు వేయడానికి ఆదివారం ఉదయం వెళ్లాడు. తీగతో ఉచ్చులు వేస్తున్నాడు. అక్కడున్న గుడిసెకు వెళ్లే సర్వీస్ వైరు పొలం ఫెన్సింగ్‌కు తగిలి మొత్తం విద్యుత్ సరఫరా అయ్యింది. ఆ సమయంలో వేణు చేతిలో ఉన్న తీగ ఫెన్సింగ్‌కు తగిలింది. దీంతో ఇక్కసారిగా షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. వేణు ఇంటికి రాలేదని బంధువులు వెతుకుతున్న సమయంలో చనిపోయి కనిపించాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉలవపాడు సీహెచ్‌సీ తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తవ్వేస్తాం.. దోచేస్తాం



జేసీబీతో తవ్విన ఇసుక



ఇసుక తవ్వకాలు చేసేందుకు వేసిన రోడ్డు

- పాలేరు నదిలో ఇసుక తవ్వకాలు
- టిప్పర్లు తిరిగేందుకు అనువుగా రోడ్డు ఏర్పాటు
- నదిలో పట్టా ఎలా ఇచ్చారంటున్న గ్రామస్తులు
- ఎంపీ, కలెక్టర్‌కు ఫిర్యాదు

కందుకూరు రూరల్: కూటమి ప్రభుత్వంలో ఇసుక మాఫియా రెచ్చిపోతోంది. కందుకూరు మండలంలో ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వేస్తున్నారు. పందలపాడు గ్రామానికి చెందిన ఓ రైతుకు పాలేరు నదిలో సుమారు రెండెకరాల భూమి ఉంది. ఇక్కడ ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలించుకుని సొమ్ము చేసుకుంటున్నారు. అయితే అప్పటి వరకు గ్రామస్తులు ఎవరూ పట్టించుకోలేదు. రెండు రోజులుగా ఒంగోలుకు చెందిన వారు రంగంలోకి దిగారు. కారులో వచ్చి ఇసుకను పరిశీలించి వాహనాల రాకపోకలకు రోడ్డు కూడా ఏర్పాటు చేశారు. జేసీబీతో ఇసుకను తవ్వి కుప్పలు పోస్తున్నారు.దీనికి అడ్డుకట్ట వేయకపోతే వ్యవసాయ భూములకు, మంచినీటి పథకాల బోర్లకు ఇబ్బంది కలిగే అవకాశం ఉందని భావించిన గ్రామస్తులు శనివారం నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం కలెక్టర్‌కు దృష్టికి వెళ్లింది. కందుకూరు సబ్ కలెక్టర్ ద్వారా ఇసుక తవ్వకాలు నిలిపివేయిస్తామని కలెక్టర్ వారికి తెలియజేశారు.

అందరికీ వాటాలు

పాలేరు నది పరీవాహక ప్రాంతాల్లో మాఫియా తిష్ట వేసి ఇసుకను కొనుగోలు చేస్తోంది. ఒంగోలుకు చెందిన ఓ వ్యక్తి కొనుగోలు చేసి కందుకూరు బడా నాయకులకు కూడా వాటా ఇస్తానని ఒప్పందం చేసుకున్నట్లు సమాచారం. అందుకే రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చినా పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అలాగే పందలపాడు గ్రామానికి కింద వైపు ఉన్న ఇసుక పొలాలను కూడా ఎకరా రూ.10 లక్షలకు కొనుగోలు చేశారు.

పట్టా ఎలా?

పాలేరు నదిలో నీరు ప్రవహించే వద్ద పట్టా ఎలా ఇచ్చారనేది ప్రశ్నార్థకంగా మారింది. నది కట్ట వెలుపల వైపే పట్టాలుండాలి. కానీ దానిని దాటుకుని పట్టా ఇచ్చి హద్దులను అధికారులు ఎలా చూపించారనేది గ్రామస్తులకు కూడా అర్థం కాని ప్రశ్న. దీనిపై కూడా రెవెన్యూ అధికారులు సర్వే చేయాలని కోరుతున్నారు. ప్రస్తుతం ఓ వ్యక్తి పట్టా ఉందని చెబుతున్నా నిజానికి అది ఆయనది కాదని.. రికార్డుల ప్రకారం మరొకరిదని స్థానికులు చెబుతున్న మాట. వారు కూడా రెండు, మూడు రోజుల్లో గ్రామానికి వస్తున్నారని ఇసుక తవ్వకాలు నిలుపుదల చేస్తారని అంటున్నారు.

ప్రమాదాలు జరిగే అవకాశం

ఇసుక తవ్వకాలు చేస్తున్న చోటుకు కొందరు గొర్రెలు, మేకల, గేదెల్ని తోలుకెళ్తుంటారు. జేసీబీతో తవ్వకం వల్ల గుంతల్లోకి నీరు చేరుతోంది. జీవాలు, మనుషులు దిగితే ప్రమాదం జరిగే అవకాశం ఉంది. వ్యవసాయ, మంచినీటి పథకాల బోర్ల వద్దకు ఈ వైపు నుంచే వెళ్లాలి.